క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యే సబితారెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ చైర్మన్

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీచీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆదివారం ఆలయ చైర్మన్ మొకరాల రాజశేఖర్‌శర్మ స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని, అదేవిధంగా బ్రహ్మోత్సవాలను ప్రభుత్వపరంగా నిర్వహించేలా ప్రత్యేకంగా నిధులు కేటాయించేలా చూడాలని ఆమెను కోరినట్లు తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేత జట్లకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం 8 జట్లు పోటీపడగా ప్రథమ స్థానంలో నేదునూరు బుల్స్ జట్టు, ద్వితీయ స్థానంలో ఛాంపియన్ చేజర్స్ జట్టు నిలిచాయి. ప్రథమస్థానంలో నిలిచిన జట్టుకు మాజీ ఉపసర్పంచ్ బుడ్డీరపు శ్రీనివాస్ రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు మాజీ వార్డు సభ్యుడు ఎండీ అఫ్జల్‌బేగ్ రూ.6వేల నగదు అందించారు. అదేవిధంగా వారికి మాజీ వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి ట్రోఫీలను అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, నాయకులు బొర్ర సురేశ్, ఎస్.వెంకటేశ్, ఎ.కుమార్, అంబేడ్కర్ యూత్ నాయకులు వి.శ్రీరాములు, వి.బాబు, ఏ.దర్శన్, ఎ.కరుణాకర్, ఎం.వెంకటేశ్, బి.సుధాకర్, జి.జగన్, ఎస్.రాజు, కె.మహేందర్, ఎ.మహేందర్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడి హేయమైన చర్య

శంకర్‌పల్లి: విధి నిర్వహణలో ఉన్న ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేయడం హేయమైన చర్య అని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం, ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని తుక్కుగూడ జిల్లా పరిషత్ పాఠశాలలో విధి నిర్వహణలో ఉన్న ప్రధానోపాధ్యాయుడు రాములుపై దుండగులు దాడికి పాల్పడడంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో దాడికి నిరసనగా సోమవారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలపనున్నట్లు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన దుండగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదం

బీఆర్‌ఎస్ నాయకుడు సామ రంగారెడ్డి

చేవెళ్ల: యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని బీఆర్‌ఎస్ నాయకుడు సామ రంగారెడ్డి అన్నారు. చేవెళ్ల మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో డీపీఎల్ సీజన్ వన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో విజేతలకు బహుమతులు ఆయన అందజేశారు. ఈ పోటీలో కెప్టెన్ విజయ్‌కాంత్ టీం విజయం సాధించింది. గ్రామానికి చెందిన చింపుల బుచ్చిరెడ్డి విజేతకు 10వేల రూపాయలు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాణిక్యం, ఎదిరే కుమార్, లాలయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

యాచారం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మయ్యకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని ఆదివారం నగరంలోని తన నివాసంలో అందజేసి మాట్లాడారు. అనారోగ్యానికి గురైన పేదలు.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం, నాయకులు జంగయ్య, జయప్రకాశ్, మల్లేశ్, చింటుగౌడ్, రాకేశ్ పాల్గొన్నారు.

ధర్మగిరి రోడ్డు– రైల్వే గేట్ రోడ్డు.. విస్తరణ తూచ్..!

- స్థానికుల నుంచి అభ్యంతరాల వెల్లువ
- రహదారి విస్తరణపై పునరాలోచన
- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తున్న అధికారులు



ధర్మగిరి రోడ్డు నుంచి రైల్వే గేటుకు వెళ్లే రహదారి

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ధర్మగిరి రోడ్డు నుంచి రైల్వే గేటు వరకు ఉన్న రహదారి విస్తరణపై అధికారులు పునరాలోచనలో పడ్డారు. ప్రస్తుత రహదారిని 80 ఫీట్ల రహదారిగా విస్తరించేందుకు హెచ్‌ఆర్‌డీసీ సిద్ధం కాగా స్థానికులు నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో రహదారి విస్తరణపై అధికారులు ప్రత్యామ్నాయం వైపే మొగ్గుచూపుతున్నారు.

ఎందుకు..?

ధర్మగిరి రోడ్డు ఎరుకల గడ్డ నుంచి రైల్వే గేటు వరకు ఉన్న రహదారి విస్తరణలో 208 మంది బాధితులున్నట్లు మున్సిపల్ అధికారులు గుర్తించారు. ఇందులో కొందరి ప్లాట్లు, కొందరి ఇళ్లు పాక్షికంగా మరికొందరి ఇళ్లు పూర్తి స్థాయిలో కోల్పోయే అవకాశం ఉండటంతో రహదారి విస్తరణపై స్థానికులు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. భారీగా ఆస్తులు కోల్పోయే వారికి ప్రత్నామ్నాయం ఎలా చెల్లిస్తారనే ప్రశ్నలూ వెల్లువెత్తాయి. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ రూపొందించకముందు నుంచీ స్థానికంగా నివాసాలున్నాయని అలాంటి వాటిని ఎలా తొలగిస్తారని కూడా ప్రశ్నిస్తున్నారు.

పరిహారం కూడా...

ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం చెల్లించే విషయం కూడా గుదిబండగా మారుతుందనే ఆందోళన నెలకొంది. ఈ కారణంగా ప్రత్యామ్నాయ మార్గంలోనే రహదారిని చేపడితేనే ఎంతో మేలని మున్సిపల్ అధికారులు సైతం భావిస్తున్నారు. పరిహారం చెల్లింపు కన్నా ప్రత్యామ్నాయమే బె టర్ అనే అంశం కూడా ప్రస్తుతం తెరపై వచ్చింది.

కీలక సమస్య...

ఈ రహదారి విస్తరణ చేపడితే రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే వాదనలున్నాయి. రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మిస్తే తప్ప రహదారి విస్తరణతో ఎలాంటి ప్రయోజనం ఉండదనే అభిప్రాయాలు కూడా స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. పాత పోలీస్‌స్టేషన్ రహదారిలో కూడా ప్రస్తుతం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న కారణంగా సంబంధిత రహదారి విస్తరణపై అధికారులు ఆలోచించాలనే వాదనలు కూడా లేకపోలేదు.

బురుజు మరమ్మతులకు వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో ప్రసిద్ధి చెందిన చారిత్రక బురుజును మరమ్మతులు చేయించేలా చూడాలని కోరుతూ ఆదివారం మేయర్ చిగురింత పారిజాతనర్సింహారెడ్డికి బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలాపూర్‌లో ఉన్న చారిత్రక బురుజు శిథిలావస్థకు చేరిందని, మరమ్మతులు చేపడితే చారిత్రక కట్టడాలు నేటి తరానికి అందించినవారమవుతామన్నారు. బురుజు దిగువన వెలిసిన అమ్మవారి గుడికి కూడా మరమ్మతులు చేపట్టి భక్తులకు దర్శనం కలిగించేలా చూడాలని కోరారు. బురుజుతో పాటు గ్రామంలో ఉన్న యూత్ భవనాన్ని కూడా విశాలం చేసేందుకు అలాగే అక్కడే గణపతి నవరాత్రుల సమయంలో సెక్యూరిటీ భద్రతకు వస్తున్న పోలీసులకు, ఇతర సిబ్బందికి వసతి కల్పించేలా మరో గదిని నిర్మించుకునేలా నిధులు మంజూరి చేయించాలని మేయర్‌కు విన్నవించామన్నారు. నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని మేయర్ పారిజాత హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్లెం నిరంజన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శివాలయ కమిటీ చైర్మన్ టేకుల శశిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, వంగేటి సుధాకర్ రెడ్డి, సంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం సాయి, ఎస్.ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుంట సత్యనారాయణ రెడ్డి, పన్నాల వేణుగోపాల్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, దుబ్బ చింటు తదితరులు ఉన్నారు.



మేయర్ పారిజాతకు వినతిపత్రం ఇస్తున్న గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు

21 నుంచి గ్రామ సభలు

ఆయా గ్రామాల ఇన్‌చార్జిలను ప్రకటించిన ఎంపీడీఓ

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ పథకాలకు సంబంధించి ఈ నెల 21 నుంచి 23 వరకు గ్రామ సభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సరిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 16 నుంచి 20వ తేదీవరకు గ్రామాల్లో సర్వే పూర్తి చేయనున్నామని, 21 నుంచి గ్రామ సభలు కొనసాగనున్నాయన్నారు. 21న కందుకూరు, కొత్తగూడ, రాచులూరు, బేగంపేట, గూడూరు, అన్నోజిగూడ, బేగరికంచె, మీర్‌ఖాన్‌పేట, గుమ్మడవెల్లి, కొలన్‌గూడ, పులిమామిడి, ధన్నారం, నేదునూరు, బాచుపల్లిలలో, 22న జైత్వారం, బైరాగిగూడ, లేమూరు, కటికపల్లి, కొత్తూర్, సార్లరావులపల్లి, ఆకులమైలారం, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, చిప్పలపల్లి, మురళీనగర్, జబ్బార్‌గూడల్లో, 23న పెద్దమ్మతండా, దావూద్‌గూడతండా, సరస్వతిగూడ, అగర్‌మియాగూడ, దాసర్లపల్లి, దాసర్లపల్లితండా, తిమ్మాపూర్, మాదాపూర్‌లలో గ్రామసభలు కొనసాగనున్నాయి. కాగా ఆయా గ్రామాలకు క్లస్టర్ ఇన్‌చార్జిలను ఎంపీడీఓ ప్రకటించారు. కందుకూరు, కొత్తగూడ, దెబ్బడగూడ, జైత్వారం, పెద్దమ్మతండా, దావూద్‌గూడ తండాలకు గ్రామ సభల ఇన్‌చార్జిగా ఎంపీడీఓ సరిత, రాచులూరు, బేగంపేట, బైరాగిగూడ, లేమూరు, సరస్వతిగూడ, అగర్‌మియాగూడలకు తహసీల్దార్ గోపాల్, గూడూరు, అన్నోజిగూడ, కటికపల్లి, కొత్తూర్, దాసర్లపల్లి, దాసర్లపల్లితండాకు ఎంపీఓ గీత, బేగరికంచె, మీర్‌ఖాన్‌పేట, సార్లరావులపల్లి, ఆకులమైలారం, తిమ్మాపూర్, మాదాపూర్‌లకు ఏఈ పీఆర్ ఎం.సతీష్, గుమ్మడవెల్లి, కొలన్‌గూడ, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడలకు ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ శారద, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్‌లకు ఏపీఓ రవీందర్ రెడ్డి, నేదునూరు, బాచుపల్లి, జబ్బార్‌గూడలకు ఎంఏఓ వై.లావణ్య ఇన్‌చార్జిలుగా వ్యవహరించనున్నారన్నారు.

అనారోగ్యంతో అమ్డాపూర్ మాజీ సర్పంచ్ మృతి

మొయినాబాద్‌రూరల్: కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ అమ్డాపూర్ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ షాపురం చంద్రకళ ఆదివారం ఉదయం మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, జిల్లాలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. గ్రామంలో గాంధీ చౌరస్తా వద్ద యువజన సంఘం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను గుర్తుచేసుకున్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

మొయినాబాద్‌రూరల్: యువత స్వయం ఉపాధిలో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఆదివారం యువకులు ఇమ్రాన్, ఇర్ఫాన్ కలిసి స్వయం ఉపాధి కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముదిగొండ రవియాదవ్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కలిసిమెలిసి పోవాలన్నారు. అప్పుడే ఎంచుకున్న ఉపాధి ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ కుటుంబ పోషణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యువకులు ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ మాజీ ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, శాంతియువజన సంఘం మాజీ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, మహేందర్ యాదవ్, అశోక్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

పసుల రామ్మూర్తిపై చర్యలు తీసుకోండి

శంకర్‌పల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్‌పల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కో-ఆర్డినేటర్లు మద్దిలేటి, ప్రశాంత్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనకు మంద కృష్ణ మాదిగ అనేక పోరాటాలు చేపట్టారన్నారు. అలాంటి వ్యక్తిపై భౌతిక దాడులు చేసి, చంపేయాలంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన పసుల రామ్మూర్తిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే మరో విధంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాని భాను, జిల్లా ఉపాధ్యక్షుడు వన్నెపాగ వంశీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

కొందుర్గు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుభరోసా పథకం అమలుపై నిర్వహిస్తున్న సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీఓ సరిత సూచించారు. ఆదివారం ఆమె జిల్లేడ్ చౌదరిగూడ మండలాన్ని సందర్శించి అధికారులు చేపడుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతుభరోసా పథకం జాబితా నుంచి తొలగించేందుకు ప్రతిపాదించాలన్నారు. అదేవిధంగా అర్హులందరికీ ప్రభుత్వం అందించనున్న పథకాలు అందేలా చూడాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2010–011లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం గ్రామ పరిధిలోని బస్వ జంగయ్యగౌడ్ ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 14 సంవత్సరాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. తమ తోటి చదువుకున్న విద్యార్థులు ఎవరైనా ఆపదలో ఉంటే వారికి తమ బ్యాచ్ తరఫున సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరేందర్, ఉపాధ్యాయులు భారీ, రాకేశ్, హరిదాస్, అశోక్, ప్రవీణ్, మంగ, పద్మ, మాధవి, పూర్వ విద్యార్థులు రాజేశ్‌నాయక్, శివశంకర్, శివకుమార్, రాఘవులు, నరేశ్, చంద్రశేఖర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకే రైతుభరోసా

తహసీల్దార్ సైదులు



ఘట్టుపల్లిలో భూ రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సైదులు

మహేశ్వరం: సాగుకు యోగ్యత ఉన్న భూములకే రైతు భరోసా వర్తిస్తుందని తహసీల్దార్ సైదులు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, భాగ్ మంఖాల్ గ్రామాల్లో రైతు భరోసా లబ్ధిదారుల ఎంపిక కోసం ఆయన రెవెన్యూ రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగుకు యోగ్యత లేని భూములకు రైతు భరోసా దక్కదన్నారు. ప్రధానంగా రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్ల నిర్మాణంలో కోల్పోయిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, నాలా కన్వర్షన్ అయిన భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు చేసిన భూములు, పరిశ్రమలకు తీసుకున్న భూములు, రైస్ మిల్స్, కంపెనీలు ఉన్న భూములు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములు, చెరువులు, కుంటలలో ఉన్న భూములకు రైతు భరోసా వర్తించదన్నారు. భూములను గుర్తించేందుకు రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఫీల్డ్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అంతకుముందు గ్రామాల్లో పలు భూములు, రికార్డులు, మ్యాపులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవత, ఆర్‌ఐలు స్వర్ణకుమారి, పావని, సీనియర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ కృష్ణంరాజు

కందుకూరు: క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడలో స్థానిక నాయకుడు గోరింకల రమేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో యువత సన్మార్గంలో నడవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. కాగా గోరింకల రమేశ్ అన్ని జట్లకు టీషర్టులను స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పంతునాయక్, మాజీ సర్పంచ్ బుక్క మహేశ్, మాజీ వార్డు సభ్యుడు గోరింకల రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ, నాయకులు చిందం శ్రీనివాస్, కొంగళ్ల శ్రీను, కొంగళ్ల శంకర్, గద్దగూటి శేఖర్, ఎలుగపల్లి నర్సింహ పాల్గొన్నారు.

సుందరం.. సూర్యోదయం





చలికాలంలో కనిపించే ప్రతీ సూర్యోదయం కనువిందుగానే ఉంటుంది. మంచు మబ్బులను చీల్చుకుంటూ వచ్చే భానుడి బంగారు రంగు కిరణాలు మనసును హత్తుకుంటాయి. పచ్చని పంట పొలాలు, కిలకిల రాగాలు చేసే పక్షులతో కూడిన పల్లె సీమ అందాల నడుమ కనిపించే భానూదయం చూడముచ్చట గొలుపుతుంది. షాబాద్ మండల కేంద్రంలోని పైల్వాన్ చెరువులో కనిపించిన ప్రకృతి రమణీయ చిత్రాన్ని ఆదివారం సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. – షాబాద్

బీజేపీ బలోపేతానికి కృషి

రాష్ట్ర నాయకుడు శేరి నర్సింగ్‌రావు



నూతన మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నర్సింగ్‌రావు

చేవెళ్ల: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు శేరి నర్సింగ్‌రావు అన్నారు. చేవెళ్లలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన అత్తెల్లి అనంత్‌రెడ్డిని ఆయన శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ రోజు రోజుకు బలోపేతం అవుతుందని, యువత ఎంతో ఉత్సాహంగా పార్టీ కోసం పనిచేస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందన్నారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే వరకు ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తూ మండల కమిటీని పూర్తిస్థాయిలో ప్రకటించి మండలంలోని అన్ని గ్రామ కమిటీలను కూడా వేసుకోవాలని సూచించారు. అందరం కలిసి పార్టీని బలోపేతం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు విఠల్‌రెడ్డి, యువ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్గారి భార్గవ్‌రెడ్డి, జయసింహ, మహేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేసారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో..

మండలంలోని కేసారం గ్రామానికి చెందిన బీజేపీ గ్రామ కమిటీ సభ్యులు ఆదివారం నూతన మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డిని సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేసారం గ్రామ నాయకులు కె. మహేందర్, సంజీవ్‌రెడ్డి, నాగరాజ్‌గౌడ్, రఘు, వినయ్, కుమార్, మహేందర్ తదితరులు ఉన్నారు.

మామిడిపల్లి బస్సును పునరుద్ధరించండి

డీఎంకు వినతి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: గతంలో ఉన్న విధంగా షాద్‌నగర్ నుంచి మామిడిపల్లి గ్రామం వరకు బస్సును పునరుద్ధరించాలని పలువురు నాయకులు ఆర్టీసీ డిపో మేనేజర్ ఉషను కోరారు. ఈ సందర్భంగా ఆదివారం డీఎంకు వినతిపత్రం అందజేశారు. షాద్‌నగర్ నుంచి నందిగామ మండలం మామిడిపల్లి గ్రామం వరకు బస్సు నడిపించే వారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఈ బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. షాద్‌నగర్ నుంచి అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, చెర్ల అంతిరెడ్డిగూడ, మొదళ్లగూడ, మజీదు మామిడిపల్లి, మామిడిపల్లి గ్రామాలకు ఉదయం, సాయంత్రం బస్సును నడిపించాలని కోరారు. మారుమూల గ్రామాల నుంచి ఎంతో మంది ప్రజలు, విద్యార్థులు, కార్మికులు ప్రతి రోజు పట్టణానికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు కొనసాగిస్తుంటారని, అధికారులు స్పందించి మామిడిపల్లి బస్సును తిరిగి ప్రారంభించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ సీతారాం, తదితరులు ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఇబ్రహీంపట్నం: సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 25 నుంచి 28 వరకు జరగనున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నేతలు కోరారు. ఆదివారం దండుమైలారం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జగన్ మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను మహాసభల్లో రూపొందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగస్వామి, రమేష్, చరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.